క్లుప్తంగా

మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడిగా రంగా



రంగాను అభినందిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

పాలకోడేరు: మండల ఆర్య వైశ్యసంఘం అధ్యక్షునిగా పెన్నాడ కు చెందిన అక్షింతల రంగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన పేరును సోము వెంకట్రావు ప్రతిపాదించగా, శృంగవృక్షం ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధి రాజా బలపర్చగా, మిగిలిన గ్రామ సంఘాలు మద్దతు పలికాయి. ఈ సందర్భంగా రంగా మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు. తనను మండల సంఘానికి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా సంఘం నాయకులు కె రఘురాములు, కోడూరి కుమార్‌లు ఈ ఎన్నికను నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు

ఆలయాభివృద్ధికి విరాళం అందజేత



వదలిలో శ్రీ మందాలమ్మ ఆలయకమిటీకి విరాళం అందిస్తున్న అత్యం మధువంశీ

పెనుగొండ: వదలి గ్రామంలో శ్రీ మందాలమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన అత్యం నాగేశ్వరరావు కుమారుడు మధువంశీ ఆదివారం రూ.47,251 విరాళం అందజేశారు. మధువంశీ ఇంజినీరింగ్ పూర్తి చేసి ఇటీవలే ఉద్యోగంలో చేరారు. తన మొదటి జీతాన్ని ఆయన అమ్మవారి ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు కుటుంబాన్ని మందాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. వీరి కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకుని అమ్మవారి ఆలయ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు.

వర్గీకరణ సాధనే లక్ష్యం

మొగల్తూరు: ఎస్సీ రిజర్వేషన్ ఏబీసీడీ వర్గీకరణ సాధించే వరకు మాదిగలంతా ఒకేతాటిపై ఉండాలని జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కోడెల్లి వెంకట్రావు కోరారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పేరుపాలెం సౌత్‌లో ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపకుడు ఉసిరిపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో బ్రహ్మయ్య చేపట్టిన ప్రతి కార్యక్రమంలో కలిసకట్టుగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉల్లంపర్తి బులినర్సు మాదిగ, కారుమించి కృపాల్, కొండేటి సామ్యూల్ రాజు, లక్కవరపు భాస్కరరావు, సవరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలి

పెనుమంట్ర: రాష్ట్రంలో చేనేత కార్మికులకు గుర్తింపుకార్డులు మంజూరు చేయాలని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సూర్యభాస్కరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెనుమంట్ర మండలం మార్టేరులో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను జిల్లాలో ప్రతినియోజకవర్గంలో పర్యటిస్తున్నాని, చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారిని కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నానని చెప్పారు. ప్రభుత్వం నుంచి చేతి వృత్తిదారులకు రావాల్సిన రాయితీలు వచ్చేలా కృషి చేస్తానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కులస్తులు అధికంగా ఉన్నారని, ప్రభుత్వం గుర్తించి చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. చేనేత సొసైటీలకు ఎన్నికలు జరిపించాలన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఉండిలో జగన్నాథుని రథోత్సవం

ఉండి: ఉండి కొత్తపేటలో జగన్నాథస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం కొత్తపేట నుంచి ఉండి ప్రధాన రహదారుల్లో స్వామివారిని ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని స్వాగతిస్తూ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు నిర్వాహకులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసారు.

డ్రెయినేజీ వ్యవస్థ లేక అవస్థలు

అత్తిలి: కురుస్తున్న వర్షాలకు అత్తిలి గ్రామంలో పలు పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు నిలవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ లేక వర్షం నీరు రోడ్డుపైకి చేరుతోంది. అత్తిలి సంతానగోపాలస్వామి ఆలయ సమీపంలో ఆర్అండ్‌బీ రహదారిపై వర్షం నీరు నిల్చిపోవడంతో ద్విచక్రవాహనదారులు అసౌకర్యానికి గురౌతున్నారు. ఈప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మించినప్పటికీ, డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో వర్షం వస్తే నీరు నిలిచిపోతుంది. పల్లపు ప్రాంతంగా ఉన్న ఈ ప్రదేశంలో వర్షం నీరు బయటకు వెళ్లే విధంగా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గ్రామాల్లో సాగు సందడి



వరి నారుమడులలో కారెంతో నీరు తోడుతున్న దృశ్యం



యనమదుర్రులో పంట పొలంలో దుక్కుదున్నుతున్న దృశ్యం

- వడివడిగా తొలకరి పనులు
- బిజిబిజీగా అన్నదాతలు

భీమవరం అర్బన్ : మండలంలో వర్షాలు పడుతుండటంతో తొలకరి పొలం పనులను అన్నదాతలు ఉత్సాహంగా చేస్తున్నారు. వర్షాలు పడుతుండడంతో పొలంలో ట్రాక్టర్లతో దమ్ములు, దుక్కులు చేస్తూ వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. దిరుసుమర్రు, యనమదుర్రు, రాయలం, చినఅమిరం, తాడేరు, బేతపూడి, తుందుర్రు, పెదగరువు, కొవ్వాడ అన్నవరం, నరసింహపురం తదితర గ్రామాల్లో తొలకరి పనులు చేస్తున్నారు. ఈ ఏడాది సార్వా సుమారు 7వేల ఎకరాలలో సాగు చేయబోతున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇప్పటికే 80 శాతం పైగా వరి నారుమడులు పూర్తయ్యాయి. గునుపూడి తదితర గ్రామాలలో ముందుగా వేసిన వరినారును తీసి వరినాట్లు వేస్తున్నారు. వరినాట్లు వేసేముందు 15రోజులకంటే ముందు దమ్ము పూర్తయ్యాక బాస్వరం, జింక్ వేసుకునే రైతులు ఈ రెండింటిని విడివిడిగా కలిపివాడుకోవాలి. రెండు కలిపి వినియోగిస్తూ పంటకు నష్టమేఎక్కువ అయ్యే అవకాశంఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సార్వాలో అనుకూలమైన వంగడాలు

సార్వా సాగులో ప్రధానంగా ఎంటీయూ 1318, సంపద స్వర్ణ, ఎంటీయూ 1061 వంగడాలు అనుకూలం. ఇవి భారీ వర్షాలు, వరదలకు కొద్దిగా తట్టుకోవడంతో ఈ వంగడాలను రైతులు సాగుచేస్తున్నారు. వరి నారు వేసిన 20 నుంచి 30 మధ్య నారిని తీసి వరి నాట్లు వేయాలని, నారి కొనలు తుంచి వేస్తే కాండం దొలుచుపురుగు, తదితర తెగులు పంటపై ప్రభావం ఉండదని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ సూచిస్తున్నారు. అలాగే నారికి నాలుగు నుంచి ఆరు ఆకులు ఉండేలా చూసుకోవాలన్నారు. 30 రోజుల కంటే ఎక్కువ నారిని వరినాట్లు వేస్తే దిగుబడిపై ప్రభావం చూపుతుందని తెలిపారు.

భూసారం ఆధారంగా

రైతులు పంట పొలంలో భూసారం ఆధారంగా ఎరువులు వాడితే ఖర్చు ఆదా అవుతుంది. కొంత మంది రైతులు ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడితే సాగు ఖర్చు పెరుగుతుందని, అందువల్ల రైతులు ఈ విషయంలో దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.

లేత నారుని తీసి వరినాట్లు వేయాలి



రైతులు లేత వరినారిని తీసుకుని వరినాట్లు వేయాలి. అదేవిధంగా నారి కొనలు తుంచి నాటాలి ఇలా చేయడం వల్ల కాండం దొలుచు పురుగు ఉధృతుని, పంటపై వ్యాప్తి తక్కువగా ఉంటుంది. సాగులో విచక్షణరహితంగా ఎరువులు, పురుగు మందులు వాడకూడదు. భూసారం పరీక్షల ఆధారంగా వాడాలి. వరినారు అందుబాటులో లేని రైతులు వెదజల్లే పద్ధతి అనుసరించాలి. దీని వల్ల రెండు వారాలు కలిసి రావడంతో పాటు రూ. 4 వేలు వరకు ఖర్చు ఆదా అవుతుంది. – నిమ్మల శ్రీనివాస్, వ్యవసాయాధికారి, భీమవరం మండలం

లేటెస్ట్ టెక్నాలజీ అధ్యయనం చేయాలి



ఉమాదేసును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: వేగంగా మారుతున్న లేటెస్ట్ టెక్నాలజీని ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు అధ్యయనం చేసి విద్యార్థులకు అందించాలని ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ నిపుణుడు ఉమా దేసు అన్నారు. భీమవరం ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఏఐఎంఎల్ విభాగం, సీఎస్సీ డిపార్ట్‌మెంట్ల సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులు పాటు జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాంప్ట్ ఇంజినీరింగ్ అనే అంశంపై వారం రోజులు పాటు జరిగిన వర్క్ షాప్ ఆదివారం ముగిసింది. వర్క్ షాప్‌నకు ఏఐఎంఎల్ హెడ్ డాక్టర్ జీఎస్‌వీజీ శిరీష అధ్యక్షత వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏఐ నిపుణులు ఉమా దేసు మాట్లాడుతూ గతంలో టెక్నాలజీ మార్కెట్లోకి వచ్చేసరికి చాలా టైం తీసుకునేదని ప్రస్తుతం ఎంతో వేగంగా టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధ్యాపకులు నిరంతరం నూతన టెక్నాలజీ వైపు దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు ఏఐ నిపుణులు ఉమా దేసు ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణమరాజు, ట్రిపుల్ ఐటీ డెవలప్మెంట్ ఇంజినీర్ పి.భాస్కరరావు, సీఎస్సీ హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆర్.మూర్తి, పి.సరోజ తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన ‘కూరగాయలు’

- చుక్కల్లో నిత్యావసరాల ధరలు
- వినియోగదారుల ఆందోళన



మోగల్లు వారపు సంతలో కాయగూరలు విక్రయిస్తున్న దృశ్యం

పాలకోడేరు: రోజరోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు ఇప్పుడు కూరగాయల ధరలు తోడయ్యాయి. అమాంతంగా పెరిగిన కూరగాయల ధరలతో పేద, మధ్య తరగతి కొనలేక అవస్థలు పడుతున్నారు. ఏం కొనాలన్నా కిలో రూ. 60లు పైమాటే. టమాట పులుపెక్కితే.. మిర్చి ఘాటెక్కింది. కాకర మరింత చేదెక్కింది. రోజుల వ్యవధిలోనే ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కూరగాయలు కొండెక్కి కూర్చున్నాయి. దీంతో సామాన్య ప్రజలు ఏమీ కొనలేం.. తినలేమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్న, మొన్నటి వరకు ఓ మోస్తరులో ఉండే ధరలు నేడు చుక్కలనంటుతున్నాయి. మార్కెట్‌కు వెళ్లి కూరగాయల ధరలు చూస్తే సామాన్యుల గుండె బరువెక్కిపోతోంది.

రెండింతలు పెరిగిన ధరలు

నిత్యం కూరల్లో వినియోగించే కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. కిలోలల్లో కొనుగోలు చేసేవారు సైతం ప్రస్తుతం పెరిగిన ధరలకు పావు, అరకిలో కొనుగోలు చేస్తూ సరిపెట్టుకుంటున్నారు. ప్రస్తుతం తణుకు మార్కెట్‌లో కూరగాయల ధరలు ఒక్కసారిగా రెండింతలు పెరగడంతో ఏమీ కొనలేకపోతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. మరో వైపు పప్పు దినుసుల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. ఏ కూరగాయాలు కొనుగోలు చేయాలన్నా కిలో రూ. 60 పైమాటే పలుకుతున్నాయి. ఎండాకాలం పేరుతో మరింత ధరలు పెంచి విక్రయిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా 70 శాతం మంది రైతులు కూరగాయల సాగు చేపట్టలేదు. వంటింట్లో ఎలాంటి వంటకాలు చేయాలన్నా టమోటా, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డలు తప్పనిసరిగా ఉండాలి. రోజువారి వాడకంలో వీటి పాత్ర చాలా కీలకం. వీటిలో కిలో చిక్కుళ్లు రూ. 120, బీట్‌రూట్, బెండ, బీన్స్ ధరలు రూ. 100 పైగా ధరలు పలుకుతున్నాయి. సామాన్య ప్రజలకు పెరిగిన కూరగాయల ధరలు భారంగా మారాయి.

రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి



నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి రాజేష్

అత్తిలి: నారుమడి ఏర్పాటులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన నారుని పొందవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. మండలంలోగల పలు నారుమడులను ఆయన పరిశీలించారు. చలి ఎక్కువగా ఉండే దాళ్వా వరి సాగులో జింకులోప లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయన్నారు. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పు న వేయాలన్నారు. వరినాట్లు వేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కాండం తొలిచే పురుగు ఆకు చివర గుడ్లు పెడుతుందని, నారు నాటే సమయంలో కొసలు విరిచి నాటాలన్నారు. దీంతో గుడ్లు నిర్మూలించి పురుగు ఉధృతి తగ్గించవచ్చన్నారు. మొత్తం భాస్వరం ఎరువును దమ్ములోనే వేయాలన్నారు. నారు తీసేసమయంలో మొక్కలు లేతాకు పచ్చగా ఉంటేనే మూన త్వరగా తిరుగుతుందని, నాలుగు నుంచి ఆరు ఆకులున్న నారును ఉపయోగించాలని చెప్పారు. ముదురునారు నాటితే దిగుబడి తగ్గుతుందని, నాటు వేసేటప్పుడు భూసారాన్ని అనుసరించి ఖరీఫ్‌లో చ. మీ.కు 33 మూనలు ఉండేటట్లు చూడాలన్నారు. నాటిన అనంతరం ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ బాటలు తీయడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి, చీడపీడల ఉధృతి కొంతవరకు అదుపు చేయవచ్చన్నారు. ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు వేయడానికి, పైరు పరిస్థితిని గమనించడానికి ఈబాటలు బాగా ఉపయోగపడతాయని ఏఓ రాజేష్ వివరించారు.

అమ్మవార్ల ఆలయాల్లో భక్తుల రద్దీ



బండి ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచి చిరుజల్లులు పడుతున్నా అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

మొళ్లపర్రులో..

మొళ్లపర్రు కనకదుర్గ బీచ్‌లో వేంచేసియున్న దశావతార సహిత మత్స్యనారాయణ స్వామి, అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో ఆదివారం వేకువ జాము నుంచి వారాహి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రవీణ్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో నక్షత్ర దోషాలు, కార్యసిద్ధి దుష్టగ్రహ నివారణకు పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి నిర్వహించిన పంచామృతాభిషేకంలో గ్రామస్తులు నాగిడి రంగారావు, సత్తినేని సర్వేశ్వరరావు, మేకం రంగనాథ్, నేదునూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు వారాహి అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

ఆకివీడు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాన్ని పట్టణంలోని వైఎస్సార్ సెంటర్, వైఎస్సార్ విగ్రహాలు ఉన్న చోట్ల నిర్వహిస్తున్నట్లు పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అంబటి రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నగర పంచాయతీ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, పార్టీ అనుబంధ సంఘ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉండి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాన్ని నియోజకవర్గ కన్వీనర్ పీవీఎల్ నర్సింహరాజు ఆదేశాల సోమ వారం ఉండిలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉండి పోలీస్‌స్టేషన్ వద్ద గల వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించే ఈ కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్



వల్లూరులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పెనుగొండ: విద్యార్థులకు విద్యతోనే మంచి భవిష్యత్ ఉంటుందని వల్లూరు గ్రామసర్పంచ్ నేలపూడి బేబీ రామ్మోహనరావు అన్నారు. వల్లూరులో మహిళా జూనియర్ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. సభకు సర్పంచ్ బేబీ రామ్మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నత విద్యను అభ్యసించి మంచి మంచి ర్యాంకులతో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారన్నారు. కార్పొరేట్ స్కూళ్లలో లక్షలు లక్షలు ఫీజులు కట్టి చదివినా చివరకు ఎటువంటి ఉద్యోగాలు లేక ఇంటి దగ్గే ఖాళీగా ఉంటున్నారన్నారు. పాఠశాల హెచ్ఎం శ్రీధర నర్సింహ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన ముగ్గురు విద్యార్థులు ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ ఆయా విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులను సర్పంచ్ బేబీ రామ్మోహనరావు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీమలాపురం సర్పంచ్ గుబ్బల మాధవరావు, పాఠశాల చైర్మన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ దొరబాబు, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు ఆరుమిల్లి సుబ్బారావు, ఉప సర్పంచ్ గెద్దాడ శ్రీనివాసరావు, స్కూల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు నేలపూడి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

- ఆదమరిస్తే అంతే సంగతులు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలంటున్న వాహనదారులు



కోరుకొల్లు మోగల్లు రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు



భీమవరం, అత్తిలి రహదారి లో ప్రమాదకరంగా ఉన్న మలుపు

పాలకోడేరు : భీమవరం నుంచి తణుకు వెళ్లే రహదారిలో పలుచోట్ల రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా తయారయ్యాయి. కోరుకొల్లు నుంచి అత్తిలి, తణుకు వైపు వెళ్లే రహదారులపై కొన్నిచోట్ల ఎల్ ఆకారంలో, మరికొన్నిచోట్ల జెడ్, ఎస్ ఆకారంలో మలుపులు ఉన్నాయి. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారులపై మలుపుల వద్ద రోజూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు మత్యువు కబళిస్తుంటే, మరికొందరు త్రుటిలో బయట పడి, క్షతగాత్రులుగా మారుతున్న సందర్భాలనేకం. భీమవరం అత్తిలి రహదారులో కుముదవల్లి వద్ద ఎస్ కారంలోనూ మలుపు ఉండటం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే పాలకోడేరు రావి చెట్టు సెంటర్ నుంచి మోగల్లు వెళ్లే రహదారిలో మలుపు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గమనించకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ మలుపు వద్ద గతంలో అనేక ప్రమాదాలు జరిగాయి. మోగల్లులో నుంచి కోరుకొల్లు సెంటర్ మీదగా ఈడూరు వెళ్లే రోడ్డులోను ప్రమాదకరం మలుపులు ఉండడంతో ఇటు వైపు ప్రయాణం చేసే వాహనదారులు బిక్కు బిక్కు మంటూ ప్రయాణిస్తున్నారు. తణుకు వైపు వెళ్లే వాహనాలు, భీమవరం వైపు నుంచి వచ్చే వాహనాలు ఒకేసారి మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చినప్పుడు తప్పకోవడం ఆటోలకు, మోటార్ సైక్లిస్టులకు గగనంగా మారింది. భీమవరం వైపు వెళ్లే రహదారిలో పలు మలుపులు ఉన్న ఎల్ ఆకారపు మలుపులలో ఎదురుగా వచ్చే వాహనాలు సమీపంలోకి వస్తే తప్ప కనిపించవు. కోరుకొల్లు నుంచి వచ్చే మాగల్లు రహదారిలో పొలిమేర కోడు వంతెన మలుపు గమనించక ఇటీవలే వాహనాలు, మరో టాక్సీ మలుపు వద్ద కాల్వలోకి దూసుకుపోయాయి. ఊరి బయట మలుపుల్లో తుప్పలు, పిచ్చి మొక్కలు పెరిగిపోవడం వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ఇలాంటి మలుపుల వద్ద అధికారులు హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణలు, మార్గ సూచికలు ఏర్పాటుచేస్తే కొంతైనా ఫలితం ఉంటుందని వాహనదారులు కోరుతున్నారు. పాలకొల్లు -భీమవరం 165 జాతీయ రహదారిలో విస్సాకోడేరు వద్ద గల రైస్ మిల్ వద్ద ఉన్న మలుపులో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించవు. ఈ మలుపుల్లో వాహన వేగ నియంత్రణలు స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలని ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.

నరసాపురంలో వదలని వాన

నరసాపురం: నరసాపురంలో గత మూడురోజులుగా స్వల్ప స్థాయి నుంచి ఓ మోస్తరు వర్షం పడుతోంది. ఆదివారం నరసాపురంలో 24.2 మీమీ వర్షపాతం నమోదైంది. మరో రెండురోజులపాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావారణశాఖ తెలిపింది.